**బెంగుళూరు విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ గుంటూరు పొలిమేరలకు చేరుకునేసరికే బాగా పొద్దెక్కింది. కానీ, ఆ కంపార్ట్‌మెంట్‌లో ఉన్న అమ్మాయిల్లో ఒక్కరో, ఇద్దరో తప్ప తతిమ్మా వాళ్లెవ్వరూ కదల్లేదు, మెదల్లేదు. శాలువాలు, రగ్గులు కప్పేసుకుని, ఫుల్ ఓవర్లు బిగించేసుకుని ఆ రైలు పెట్టంతా వాళ్లదేనన్నట్లు ఇష్టారాజ్యంగా శయనించి ఉన్నారు.**

**"ఏయ్! మొద్దులూ గుంటూ రొచ్చేసింది ... ఇంక ఆ బెంగుళూరు వేషాలు తీసెయ్యండి. లేవండి ... లేవండి ...!" అంటూ ఒకరిద్దరిని పొడిచింది వకుళ, తన స్వెటర్‌ని అసహనంగా పైకి లాగేసుకుంటూ.**

"పడుచుదనం రైలుబండి పోతున్నదీ ... అహ పోతున్నదీ ..." అంటూ సరళ లేచి బ్రష్, పేస్టూ, క్రీమూ, దువ్వెనా, బొట్టుబిళ్లలూ గట్రా ఉన్న చిన్న రంగురంగుల సంచీని తన బెర్తుమీది నుంచి లాక్కుని అర్జెంటుగా అటు పరుగెత్తింది.

"మా వూరు బెజవాడేయ్ గుండూ ... అబ్బా! డోంట్ డిస్టర్బ్ మీ!" అంటూ అప్పర్ బెర్త్ గోడవేపు తిరిగి మూడంకె వేసేసింది రవళి.

"సారీ జీన్స్!" అంది శ్వేత శాలువా కొంచెం తీసి, చూసి తిరిగి కప్పేసుకుంది.

"లేవవే, మినీ స్కర్ట్!" అంటూ రాధ నొక్కటి వేసింది రంజన.

ఫ్యాషన్ పరేడ్‌కి బెంగుళూరు వెళ్లి తిరిగొస్తున్నట్లుగా ఉన్న ఆ అమ్మాయిల దండు మాడమ్‌ని లేపు ముందు" అంటూ, తన జోక్‌కి తనే పగలబడి నవ్వింది రాణీ. సదరు మాడమ్‌కి జలుబు చేసి, ముక్కు మూసుకుపోయింది. ఆవిడో మూటలాగ వో మూల పడుంది!

ఈ ఆడపిల్లలంతా ఉదయ విన్యాసాలు, విలాసాలు ఒలకబోయడం పూర్తి కాకుండానే రైలు బెజవాడకు పోయే తొందరలో గుంటూరు ప్లాట్‌ఫామ్‌ని వదిలేసింది. కదిలే కిటికీల దగ్గిరగా ఇద్దరు కుర్ర వెండార్లు తొంగి చూస్తూ, "చుట్టా బీడీ సిగరెట్!" అంటూ మేకల్లాగా అరిచారు.

"మీ మొహాలు తగలెయ్యా!" అంటూ లేచింది మాడమ్. ఆవిడే కదా ఈ ముద్దుగుమ్మలందరికీ జవాబ్‌దారీ. రాబోయే విజయవాడ స్టేషన్‌లో బ్రేక్‌ఫాస్ట్ చెయ్యడంకోసం పెట్టాడు.

అంతా ఊపిరి పీల్చుకున్నారు. "పాపం! బొమ్మలబ్బాయే!" అంది కొంచెం బొద్దుగా ఉండి కూచున్నచోటు నుండి లేవడానికి బద్ధకించిన రోజా.

"బొమ్మలు కొనండి ... మిస్!" అన్నాడు వాడు. సంచీలోంచి రంగు రంగు బొమ్మలు తీశాడు. కాగితం గుజ్జుతో చేసిన బొమ్మల రకాలు చాలానే ఉన్నాయి. స్టాండుకి గుచ్చిన ప్లాస్టిక్ బొమ్మలు రకరకాలు చూపిస్తూ, "బొమ్మలోయ్ ... బొమ్మలు ... రకరకాల బొమ్మలు అమ్మాయిలకు హీరోల బొమ్మలు, అబ్బాయిలకు హీరోయిన్ల బొమ్మలు, డిస్కోబొమ్మలు, బ్రేక్‌డాన్స్ బొమ్మలు, రమ్యకృష్ణ బొమ్మలు, రంభ బొమ్మలు!" అంటూ అరుస్తూ పీచుమిఠాయివాడు మిఠాయి పుల్లలకి

# బొమ్మలోయ్! బొమ్మలు!

## వీరాజీ

నిజానికి, మైసూర్ స్టడీ టూర్‌కు పోయి, బెంగుళూరు నగరం చల్లని ఒడిలో తనివి తీరా రంగురంగుల బుల్లిబుల్లి దుస్తులు ధరించి హాయిగా విహరించి తిరిగొస్తున్న కాలేజీ పరువాల మూట!

కానీ, ఎక్స్‌ప్రెస్ రైలు గుంటూరులో ఆగీ ఆగకముందే చీమలు కుడితే లేచిపోయినట్లు లేచిపోయారంతా. శీతాకాలమైనా, యమ శీతాకాలమైనా గుంటూరు, బెజవాడల్లోనా? చలిదుస్తులు ధరించుట? వొంటిమీద నూలుపోగుంచుకుంటేనే ఘనత ...

అమ్మాయిలంతా లేచి, ఆవలించి ముంగురులు సవరించుకుని బొట్టు బిళ్లలు నుదుట సర్దుకుని, "కాఫీ కాఫీ! చాయ్ చాయ్! హాయ్ హాయ్!" అంటూ సరదాగా గోల మొదలెట్టేసరికి "నీ బోయ్‌ఫ్రెండా? నా మొగుడా? ఎవడే ఇక్కడ మనకి రిసెప్షన్ ఏర్పాటు చేశాడు ...? తయారైపోతున్నారు అతివలంతా ... నంబూరు హాల్టు దాటిపోతోంది కాబోలు రైలు ... ఎవరో చైన్‌లాగినట్లు బాగా స్లో అయిపోయింది. అంతలో తెరిచి ఉన్న కంపార్ట్‌మెంట్ డోర్‌లో నుంచి ఒక వింత పదార్థం ఎవరో తంతే వచ్చిపడ్డ బంతిలాగ వచ్చి పడ్డది.

"కెయ్", "కెవ్వు" మన్న అమ్మాయిలు ఆ పడ్డ పదార్థాన్ని ఒక పదేళ్ల బాలుడిగా గుర్తించారు. వాడు లేచి, ఒకచేత ధరించిన బరువైన జోలి సంచీని సరిగ్గా పైకి లాక్కుని రెండోచేత ధరించిన బొమ్మలు గుచ్చిన స్టాండు కర్రని సరిగ్గా నిలబెట్టి 'యిహీ' మన్నాడు అమ్మాయిలకు సారీ చెప్పినట్లు.

వెంటనే "బొమ్మలోయ్ .... బొమ్మలూ!" అంటూ అరిచాడు. జామిచెట్టుమీద ఇలా వాలి, అలా తిరిగి ఎగిరిపోయే రామచిలుక కంఠంలాగుంది వాడి గొంతు. "బొమ్మలు అమ్మాయిగారో బొమ్మలు..." అంటూ ఆశ చుట్టి పసిపిల్లలకు అందించినట్లు, రబ్బరు బూరలవాడు రంగురంగుల బెలూన్లు ఊది అందించినట్లు తలో బొమ్మా అందించేశాడు వాడు.

అమ్మాయిలు ఆ కుర్రవాడి ఈ అనుకోని చొరవకి చకితులైపోయారు. కాదు కాదు, ముగ్ధులైపోయారు.

"మోనికా లెవెన్స్కీ బొమ్మొందా గురూ?" అనడిగింది ఝాన్సీ. వాడు కొంచెం తెల్లబోయాడు కానీ, అది దాచుకుని విప్పారిన మొహంతో "పూలన్‌దేవి బొమ్మొంది. ఇచ్చేదా? మిస్!" అన్నాడు.

"ఇదుగో ఇది మైఖేల్ జాక్సన్. ఈడు దిలేర్ మెహందీ ... ఈమె, ఈల లచిమి ఈ బొమ్మ గుండు, ఇది బ్రమ్మాండం ..." అంటూ బొమ్మల్ని వర్ణించాడు.

"ఎంత బాబూ, ఈ బొమ్మ?"

"ఎంత గురూ, దీని కాస్టూ?"

"హౌ మచ్ ఈజ్ దిస్ మై బోయ్?" ఇలా అడుగుతున్న ఆ భామలకి వాడిష్టమొచ్చిన రేట్లు చెప్పాడు ఆ గడుసు బాలుడు. వాళ్లిచ్చింది తీసుకున్నాడు. మిగిలిన బొమ్మలు సంచీలో పడేసుకుని అటు తిరిగి తలుపు వేపుకి "ఛయ్ ఛెయ్యా ఛెయ్యా ... చెలో ఛెయ్యా ఛెయ్యా ... కుక్కతోక నేకొయ్యా!" అంటూ దుముకుతూ వెళ్లి నుంచున్నాడు.


"పాపం, వాడే ఒక బొమ్మ ... బొమ్మలమ్ముకునే వయసా వీడిదీ?" అన్నది ముక్కు చీదేస్తూ 'మాడమ్'.

"ఔను మాడమ్! స్కూలుకు పోయి మమ్మీ డాడీలు నేర్చుకునే వయసు వాడిది!" అంటూ జాలిపడ్డారు రవళి, వకుళ, వనజా అంతా. వనజ వాణ్ణి ఇంటర్వ్యూ చేద్దాం అనుకుంది. కానీ, ఏడీ వాడు? ఆ కంపార్ట్‌మెంట్ వెస్టిబుల్ అని వాడికి తెలుసు. అందులో నుంచి అవతలి పెట్టెలోకి పిల్లి కిటికీలోనుంచి గంతేసినట్లు గబ్‌చిబ్‌న వెళ్లిపోయాడు "వోరి షారూఖ్ ఖానూ!" అని వ్యాఖ్యానించింది శ్యామా.

"పాల బుగ్గల పసి వెధవ ... ముస్తాబు చేస్తే దొరబాబులాగ ఉంటాడు. ప్చ్! ఖర్మ ... వాడిలా, బొమ్మ లమ్ముకుంటున్నాడు. ఏం చేస్తాం? పాపం, మనదేశంలో 'పావర్టీ ఈజె వర్స్ట్ క్యర్స్' అన్నట్టు అయిపోయింది!" అంటూ మాడమ్ ఓ లెక్చర్ దంచేసింది.

"బాన్ ది చైల్డ్ ఎక్స్‌ప్లోయిటేషన్ బచ్‌పన్ బచావో!" అంటూ అరిచారు అమ్మాయిలంతా.

రైలు కృష్ణా కెనాల్ చేరుకుంటోంది. అమ్మాయిల్లో ఒకరిద్దరు తప్ప అందరూ విశాఖపట్నం వెళ్లాల్సిందే. విజయవాడ ప్లాట్‌ఫారమ్ మీదకి కాఫీ పులుల్లాగ లంఘించడానికి ఫ్లాస్కులు, వాటర్ బాటిల్సూ గట్రా తీసి రెడీ అవుతున్నారు.



ఇంతలో ఆ బాలుడు మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. వాడి మొహం దీనంగా ఆర్పేసిన దీపంలాగ ఉంది. కంగారుగా వచ్చాడు. జోలి సంచీ అక్కడ పడేసి ఏదో పోయినట్లు వెతుక్కోసాగాడు ... వాడికి దుఃఖం ముంచుకు వచ్చేస్తోంది. వెక్కిళ్లతో ఏడుపు ఒక్కటే తక్కువ ... జాలిపాట్లమే అయిపోయాడు కుర్రాడు.

"నా పైసలు పోనాయండమ్మగోరూ!" అంటూ వాడు బెర్తు క్రిందా, వాళ్ల సామానుల వారా వెతకసాగాడు. ఆందోళనా, ఆవేదనా మిళితమై అదిమివేస్తున్నట్లయిపోయాడు కుర్రకుంక. ఇందాకటి ఉడుతపిల్లలాగ లేడు వాడు. 'కీ' అయిపోయిన పాత బొమ్మలాగ ఉన్నాడు ఇప్పుడు.

"ఏమైందోయ్, డ్రీమ్ బోయ్?"

"ఏం జరిగిందోయ్ జీరో?"

"ఏమైనా పోయిందా నాన్నా?" అంటూ అమ్మాయిలు వాణ్ణి సముదాయించి చేరదీసి తల నిమిరి వోదారుస్తూ, అడగడం మొదలెట్టారు.

"మొత్తం డబ్బులన్నీ పోనాయండీ ... ఇక్కడే అడిపోయినాయో యేంటో ..." అంటూ వాడు నిక్కరు జేబులో చెయ్యి పెట్టాడు. దానికింద నుంచి చెయ్యి ఇవతలికి వచ్చేసింది. అది కన్నం పడిపోయి ఉంది.

"జేబు బొక్కడిపోయింది గావాల ... మొత్తం డబ్బులు పోనాయ్! సావుకారు యియ్యాళ నన్ను చంపేత్తాడు!" అంటూ వాడు కూలబడి, ఏడుపు లంకించుకున్నాడు.

అమ్మాయిల గుండెల్లోపల వాళ్ల వయసుతో సంబంధం లేకుండా 'అమ్మ గుండె' ఎప్పుడూ దాగి ఉంటుంది. సొంత వస్తువేదో పోయినట్లు జాలితో కరిగిపోయారు వాళ్లు.

అంతలో "ఐడియా!" అంది సుమన. తన కర్చీఫ్ తీసి అరచేత పట్టుకుంది. తన బాగ్‌లోకి రెండో చెయ్యి పోనిచ్చి ఓ అయిదు కాయితం తీసి పెట్టింది. అందరికీ అర్థమైపోయింది. తోచినంత, చేతికొచ్చినంత చిల్లరా, నోట్లూ తీసి ఆ 'రుమాలు' నిండిపోయేదాకా వేశారు.

"ఒరే బాబూ! ఇట్లా రా!" అన్నారు వాళ్లు.

సుమన పైకం అంతా లెక్క పెట్టింది. నూట యాభైరూపాయలదాకా పోగైంది.

కానీ వాడు వెంటనే రాలేదు. "సారీ మేడమ్! వద్దు మేడమ్!" అంటూ అటుతిరిగి ఏడుపు కొనసాగించాడు.

"కాదులేవోయ్, తీసుకో! జేబులో గోళీకాయలు, చిల్లర డబ్బులూ, రేజర్ బ్లేడ్లూ పడేసుకుని ఉంటావు. చిరిగిపోయింది. ఇంద ... ఫర్వాలేదులే ... గాడ్ ఈజ్ గ్రేట్!" అంటూ వాళ్లా మూట వాడికి అందించారు. ఈలోగా రైలు విజయవాడ నాలుగో నంబరు ప్లాట్‌ఫామ్ మీదకి ఎప్పుడు చేరుకుందో తెలియదు ... అంతా గోల. ఆ గోలలో వాడు జోలీ సంచీతో సహా ఎప్పుడు ఉడాయించాడో కూడా తెలియదు.

"పాపం! వ్చ్ ... వ్చ్... పోనీలే, వో మంచి పని చేశాం! ఓ హెల్ప్‌లెస్ చైల్డ్‌కి హెల్ప్ చేశాం!" అనుకుంటూ కాఫీ వాసనకి ముక్కులు ఎగరేస్తూ వాళ్లు రైలు ఇటు దిగుతున్నారు ... అవతల ప్లాట్‌ఫామ్ మీదికి మరో ఎక్స్‌ప్రెస్ రైలు దడదడా ప్రవేశించింది. ఇప్పుడు మరింత గోలగోల ...

ఇలా అటుగా పారిపోతున్న బొమ్మల బాలుణ్ణి పెద్ద స్తంభంవార నిలబడ్డ భారీకాయం ఒకటి ఎగిరి గంతేసి చేపపిల్లను కొంగ పట్టుకున్నట్లు తన గడ్డపారలాంటి చెయ్యి విసిరి ఠపీమని పట్టుకుంది. యంత్రవతుగా వాడు డబ్బుల మూట తీసి, ఆ భారీకాయానికి అందించేశాడు. ఆ భారీకాయం రుమాలు విప్పి దాన్ని వాడి మెడలో ఇలా కట్టి పైకం తన గుప్పిట ఇరికించుకుని, జాగ్రత్తగా జేబులో వేసుకున్నాడు. "బాబులన్నా! ఆకలేత్తాందన్నా!" అన్నాడు కుర్రాడు జాలిగా.

"ఆర్నీ! నీ పేరు 'ఆకలోడు' అని పెట్టాల్సిందిరా దిక్కుమాలిన నాయాల్డి, మీ యమ్మ ... సత్తినారాయణా అనెట్టేసింది!" అంటూ తన చమత్కారానికి తానే నవ్వేసి, బాబులన్న సత్తినారాయణ చేతిలో రెండు సమోసాలు కుక్కి, "యివి తినుకుంటా లగెత్తు ... యియ్యాళ 'రాడిపెళ్లాం' లెవెనో క్లాక్ షోతో యిడుదల. మనాడు చిన్నాగాడు టికెట్లిస్తాడు. ఆటిని ఆడు సెప్పినట్లు బ్లాకులో అమ్మేయాల ... డబ్బులు పోనాయో .... పేనాలు తాగేత్తానంతే ... ఫో!" అంటూ వాణ్ణి గెంటేసి, బాబులన్న పరుగున పోతున్న వాడి పృష్ట భాగం మీద తన్నడాన్ని అభినయించాడు. అట్లా కాలు విసురుతూ వాడు ప్రయోగించిన పదజాలం "నీ ...". అది మీరు విననూ లేరు ... నేను రాయనూ లేను.

స్టేషను బయటకొచ్చి, సత్తినారాయణ వరుసగా వాల్ పోస్టర్లంటించిన గోడదగ్గర ఆగాడు. దాన్నిండా ఏబ్బే! ఛండాలమైన సినిమా వాల్‌పోస్టర్లే ... కానీ వాటిపక్కన ఒక కొత్తరకం వాల్‌పోస్టర్ కూడా అంటించి ఉంది. దాన్ని ఆ ముందు వారం అంతర్జాతీయ బాలల హక్కుల ఉత్సవాల సందర్భంగా అంటించారు. "చైల్డ్ లేబర్ ఈజే క్రైమ్". "బాల కార్మికులకు విముక్తి ప్రసాదించండి! బచ్‌పన్ బచావో! నేటి బాలలే రేపటి మన సంపద!" అని ఆ పోస్టర్‌మీద రాసి ఉంది.

తనకి అర్థం కాని ఆ పోస్టర్లన్నీ కలయజూస్తూ వాడు ఒక సమోసాని నోటబెట్టుకుని వో ముక్క కొరుక్కున్నాడు. మిగతా ముక్కని రెండో చేతిలోకి తీసుకుని ఖాళీ అయిన కుడిచేత్తో నిక్కరు గుండీలు హడావుడిగా ఊడదీసుకున్నాడు. ఆగలేనంత అర్జంటు పని అది. నిశ్చింతగా ఆ రంగురంగుల పోస్టర్ల గోడమీద ఒంటేలు పోసేసి రెండో చేతిలోని సమోసా ముక్కని మళ్లీ నోట కుక్కుకుని, ఆదరా బాదరా మింగేసి, చివ్వున ఇటు తిరిగి అలవాటు చొప్పున "బొమ్మలోయ్ బొమ్మలూ!" అంటూ అరుచుకుంటూ, రివ్వున సినిమాహాలు వైపుకి పరుగులంకించుకున్నాడు సత్తినారాయణ. ■

